# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

AUGUST - 2001

## సంక్షిప్త వార్తలు

2001 జూలై 5వ తేదీ గురువారం బిక్కవోలు బైబిలు స్కూలు విద్యార్థులు గ్రాడ్యుయేషన్ ఉత్సవము జరిగెను. అనకాపల్లి గుడ్‌షపర్డ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్. ఎ. వినయానంద్ గారు నాటి సభకు అధ్యక్షత వహించిరి. బైబిలు స్కూలు డైరెక్టర్ ఎస్. జాన్ గారు నాటి ప్రసంగీకులను తదితరులను సభకు పరిచయం చేసి అందరికీ స్వాగతం పలికిరి. జాషువా గూటం, పరువు ఐజక్ గార్లు గ్రాడ్యుయేషన్ సందేశములనిచ్చిరి. విద్యార్థులకు డిప్లొమాలను డేమన్ విన్సెంటు గారు అందజేయగా, సోదరులు టి.వి.యన్. కుమార్ గారు వారికి పతకములను, పుస్తకములను అందజేసిరి. మొత్తము 9 మంది విద్యార్థులు ఆ రోజు పట్టభద్రులైరి. యస్. జాన్ గారు వందన సమర్పణ చేయగా, టి.వి.యన్. కుమార్ గారి ప్రార్థనతో నాటి స్నాతకోత్సవము ముగిసెను.

జూలై 10వ తేదీ ఉదయం మధురపూడిలో నిర్మించబడిన చక్కటి క్రీస్తు సంఘ ఆలయమును అమెరికా నుండి వచ్చిన సోదరులు హర్షల్ బియర్డెన్ గారు రిబ్బను కత్తిరించి ప్రార్థన పూర్వకముగా ప్రతిష్టించిరి. తదుపరి కూడి వచ్చిన వారందరీని ఉద్దేశించి సోదరులు హర్షల్ గారు, హేరీ ఏండర్సన్ గారు చక్కటి వాక్యోపదేశము చేసిరి. సోదరులు వి. సుదర్శనరావ్ గారి కృషి వలన, పట్టుదల వలన మధురపూడిలో మంచి ఆలయము నిర్మించబడుటయే గాక, మంచి సువార్త పని కూడ జరుగుచున్నది.

జూలై 10వ తేదీ మంగళవారం మధ్యాహ్నం కడలిలో నూతనముగా నిర్మించబడిన ఆలయములో ఏర్పాటు చేయబడిన కూటములో సోదరులు హర్షల్ బియర్డెన్ గారు వాక్యోపదేశముగావించిరి. మంచి ఆలయమును నిర్మించినందుకు హర్షల్ గారు స్థానిక సువార్తికులు వి. చిన్నయ్య గారిని, స్థానిక సంఘమును అభినందించిరి.

జూలై 11వ తేదీ బుధవారం ఉదయం ఉప్పలగుప్తం బడుగు వారి పేటలో నిర్మించబడిన ఆలయమును సోదరులు హర్షల్ బియర్డెన్ గారు రిబ్బను కత్తిరించి ప్రతిష్టించిరి, వాక్యోపదేశము గావించిరి. అదే రోజు మధ్యాహ్నం పేరాయిచెర్వు ఆదిలక్ష్మి పేటలో నిర్మించబడిన ఆలయమును కూడ సోదరులు

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 363722

Editor :

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 22 ఆగస్టు 2001 సంచిక 1


## దేవుడు ప్రేమా స్వరూపి
(God is Love)

యోహాను వ్రాసిన మొదటి పత్రిక నాలుగవ అధ్యాయములో ఈలాగు వ్రాయబడియున్నది. " ప్రియులారా మనము ఒకని నొకడు ప్రేమింతము. ఏలయనగా ప్రేమ దేవుని మూలముగా కలుగుచున్నది: ప్రేమించు ప్రతివాడును దేవుని మూలముగా పుట్టినవాడై దేవుని నెరుగును. దేవుడు ప్రేమా స్వరూపి. ప్రేమ లేని వాడు దేవుని నెరుగడు. మనము ఆయన ద్వారా జీవించునట్లు దేవుడు తన అద్వితీయ కుమారుని లోకము లోనికి పంపెను: దీనివలన దేవుడు మన యందుంచిన ప్రేమ ప్రత్యక్ష పరచబడెను" (1 యోహా 4:7-9).

దేవుడు ప్రేమయై యున్నాడని బైబిలు బోధించుచున్నది. దేవుని లక్షణము

అన్నిటిలో ప్రేమ గొప్పది. దేవుడు ప్రేమా స్వరూపి యని చెప్పగా కొందరు అట్లయితే ఈ లోకములో ఎందువలన గొప్ప అన్యాయము, అక్రమము ప్రబలియున్నదని ప్రశ్నింతురు. ప్రకృతిలో క్రూరత్వమును కనుబరచు లక్షణములున్నవని నేను అంగీకరించు చున్నాను. కరువులు, కాటకములు, వరదలు, తుఫానులు, వ్యాధులు, బాధలు, భూకంపములు మొదలగునవి అన్నియు ప్రకృతిలో యున్న భీభత్సమును బయలుపరచు చున్నవి. అయితే ఇట్టి వాటిని బట్టి మనము దేవుని ప్రేమను మరువరాదు. దేవుని ప్రేమను కనుబరచు అనేక సంగతులు మనచుట్టూ యున్నవి. గొప్ప గొప్ప పర్వతములు, సారవంతమైన లోయలు, ముడి పదార్థములతో నిండియున్న స్థలములు, పక్షుల పాటలు, సమృద్ధిగా పండే పంటలు, సుందర సూర్యోదయము, అంతకన్నా మించినదైన సూర్యాస్తమయము, అడవులు, అందముగా అలంకరింప బడిన పుష్పములు, మనశ్శాంతి నిచ్చు సముద్ర, నదీతీరములు మొదలగునవి ఎన్నియో దేవుని ప్రేమను మనకు ప్రకటించు చున్నవి.

దేవతార్చనలను, విగ్రహారాధనను ప్రోత్సహించు మతము లన్నియు దేవుడు రౌద్రుడని, శపించువాడని భయపడుదురు. అట్టి రౌద్రుని కోపము రవులుకొనకుండ వారు తమ శరీరములను తామే గాయపరచు కొందురు. అట్టి అబద్ధ దేవుండ్లను సేవించువారు ముండ్లపై కూర్చుందురు. వారి శరీరమును కోసికొందురు. చీకటి బిలములలో యుండి తపస్సు చేతురు. నిప్పులపై నడిచెదరు, ఒక్కొక్కసారి తమ పిల్లలను బలియిత్తురు. ఇట్టి వాటి నెన్నిటినో వారు చేతురు. ఇట్టి విధముగా తమ్మును తాము శిక్షించు కొనుటలో తమ యిష్ట దైవము యొక్క కోపము ఉపశమన మగునని వారి యభిప్రాయము.

అయితే దేవుడు పౌరుషము గలవాడైనను ఆయన ప్రేమించు దేవుడై యున్నాడని బైబిలు దేవుని గూర్చి మనకు విశదముగ బోధించుచున్నది. "శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించు చున్నాను" అని యిర్మియా 31:3

లో దేవుడు ప్రకటించెను. ఇంత గొప్ప మాటను, ఆశ్చర్య కరమైన సంగతిని మానవుడెన్నడు యిది వరలో వినసేలేదు. ప్రకృతిలో గాని, తత్వ సిద్ధాంతములలో గాని మానవుడు దేనినైతే కనుగొన లేక పోయెనో దానిని దేవుడే ప్రకటించెను: "శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించు చున్నాను". మనము దేవుని వెదకి నందు వలన, దేవుడు మనలను ప్రేమించు చున్నాడని బైబిలు బోధించుట లేదు. అట్లుకాదు గాని, దేవుడే మానవుని వెదికెను. "మన ప్రభువైన యేసుక్రీస్తు మనలను ప్రేమించి, కృప చేత నిత్యమైన ఆదరణయు, శుభ నిరీక్షణయు అనుగ్రహించిన మన తండ్రియైన దేవుడును మీ హృదయములను ఆదరించును" అని 2 థెస్స 2:16 లో వ్రాయబడి యున్నది. "ఈ దేవుడు సదా కాలము మనకు దేవుడై యున్నాడు. మరణము వరకు ఆయన మనలను నడిపించును" అని కీర్తన 48:14 చెప్పుచున్నది.

దేవుని ప్రేమను మనము అర్థము చేసికొనవలెనంటే, తన కుమారుని మనకొరకు అర్పించుటలో గల గొప్ప త్యాగమును గ్రహించవలెను. లేని యెడల మన ప్రయత్నములన్నియు వ్యర్థమే. బైబిలులోని బంగారు వాక్యమని చెప్పబడు యోహాను 3:16 ఇట్లు చెప్పుచున్నది: " దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవమును పొందునట్లు ఆయనను అనుగ్రహించెను ". 17వ వచనము కూడ చాల ప్రాముఖ్యమైనది. అది యిట్లు చెప్పుచున్నది: "లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకే గాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు".

ఈ వచనములో అనేక గొప్ప సంగతులు మనకు కన్పించు చున్నవి. మొదట-దేవుడు లోకమును ప్రేమించెను. దేవుడు లోకమును ఎంతో ప్రేమించి ఏమి చేసెను? ఆ ప్రేమను ఆయన సీనాయి నుండి యెరూషలేము వరకు, యెరూషలేము నుండి భూ దిగంతముల వరకు ప్రకటించెను! అంతేకాదు

ఆయన ప్రేమించి, ప్రకటించుటయేగాక, ఆయన తన కుమారుని యిచ్చెను. దేవుడు తన ప్రేమను ప్రకటిస్తూ తళతళలాడు ముత్యముల నీయలేదు. ముత్యములను అంతకన్నా శ్రేష్ఠమైన వాటిని ఆయన మానవులకు ముందే యిచ్చెను. అయితే దేవుడు లోకమును ప్రేమించి తన కుమారుని బలి యిచ్చెను. ఆయనకున్న అనేక కుమారులలో ఒక కుమారుని కాదుగాని, ఆయనకున్న ఒకేఒక్క కుమారుని ఆయన బలి యిచ్చెను. దేవుడు తన ఏకైక కుమారుని మానవునిగా ఈ లోకమున కర్పించెను. ఆయన మానవుని వలె జన్మించి పొత్తి గుడ్డలతో చుట్టబడి, పశుల తొట్టిలో పరుండ బెట్టబడెను. బహు దీనునిగా జన్మించి ఒక యౌవనునిగా నజరేతులో పెరిగెను. "యేసు జ్ఞానమందును. వయస్సునందును, దేవుని దయ యందును, మనుష్యుల దయ యందును వర్థిల్లుచు పెరిగెను " (లూకా 2:52).

యేసుకు 30వ సంవత్సరము వచ్చునరికి ఆయన యోర్దానులో బాప్తిస్మము పొందెను. అటు తరువాత మూడు సంవత్సరములు సువార్త ప్రకటించెను. ప్రజలకు దేవుని గూర్చి బోధించెను. రోగులను స్వస్థపరచెను: గ్రుడ్డివారికి చూపునను గ్రహించెను. కుంటివారికి నడువ శక్తినిచ్చెను, దయ్యములను వెళ్ళగొట్టెను. చనిపోయిన వారిని లేవదీసెను. "తండ్రి కుమారుని ప్రేమించుచు తాను చేయు వాటి నెల్లను ఆయన కనుపరచు చున్నాడని" ఆయన బోధించెను (యోహాను 5:20). నన్ను చూచిన వాడు తండ్రిని చూచు చున్నాడని కూడ ఆయన బోధించెను. యేసు దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వయు యొక్క మూర్తి మంతమునై యుండెను అని హెబ్రి 1:3లో వ్రాయబడి యున్నది. గనుక దేవుడు యేసుక్రీస్తు ద్వారా తన్నుతాను లోకమునకు బయలుపరచు కొనెను. క్రీస్తు ద్వారా ఆయన గొప్ప ప్రేమను ఈ లోకమునకు వెల్లడిపరచెను.

క్రీస్తు యొక్క జననములోను, సత్క్రియలలోను, సద్బోధలలోను దేవుని

ప్రేమ మనకగు పడుచున్నను, క్రీస్తు యొక్క మరణములో దేవుని ప్రేమ యొక్క గంభీరతను మనము చూడగలుగు చున్నాము. "మనము ఆయన ద్వారా జీవించునట్లు దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను: ఇందులో ప్రేమ యున్నది". "ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించు చున్నాము" అని భక్తుడైన యోహాను వ్రాసెను (1 యోహాను 4:9,10,19).

మానవుని యెడల దేవుని ప్రేమ శాశ్వతమైనది, యదార్థమైనది యని నిరూపించుటకు గాను క్రీస్తు తన ప్రాణమును బలి యిచ్చెను. "మన యతిక్రమక్రియలను బట్టి అతడు నలుగ గొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది. మన మందరము గొర్రెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తన కిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మనయందరి దోషములను అతని మీద మోపెను". అని ప్రవక్తయైన యెషయా వ్రాసెను (యెషయా 53:5,6).

దేవుడు ప్రేమయై యున్నాడు. యేసుక్రీస్తు ద్వారా ఆ గొప్ప ప్రేమను మనకు చూపించి యున్నాడు. ఇప్పుడు మనమాయనను ప్రేమింప వలెనని ఆయన కోరుచున్నాడు. మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు అని యేసు చెప్పుచున్నాడు. ఆయన యందు సంపూర్ణ విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారు మనస్సు నొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుట ద్వారా ఆయన యిచ్చు ప్రాథమిక ఆజ్ఞలకు లోబడుము. అటు తరువాత మరణ పర్యంతము ఆయనకు నీవు నమ్మకముగా జీవించిన యెడల నిత్య జీవము అనే కిరీటాన్ని ఆయన నీకు బహూకరించును.

❖❖❖❖

# పాపుల రక్షకుడు
# (The Saviour of Sinners)

అపొ.పౌలు I తిమోతి 1:15-17 లో వ్రాసినది మన పాఠ్యభాగమగును: "పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమునైయున్నది. అట్టివారిలో నేను ప్రధానుడను. అయినను నిత్యజీవము నిమిత్తము తనను విశ్వసింపబోవువారికి నేను మాదిరిగా యుండులాగున యేసుక్రీస్తు తన పూర్ణమైన దీర్ఘశాంతమును ఆ ప్రధానపాపినైన నాయందు కనుపరచునట్లు నేను కనికరింపబడితిని. సకల యుగములలో రాజైయుండి అక్షయుడును అదృశ్యుడునగు అద్వితీయ దేవునికి ఘనతయు, మహిమయు యుగ యుగములు కలుగును గాక. ఆమేన్".

నమ్మదగిన వాక్యమని I తిమోతి 1:15ను మనందరం ఎరుగుదుము. విలువైన గొప్ప సత్యమే నమ్మదగిన వాక్యము. దానిని అందరు ఎరుగుదురు. మొదటి శతాబ్దపు క్రైస్తవులు తరుచు ఆ వాక్యాన్ని వినియోగించేవారు. ఈ లేఖన భాగాన్ని మరికొంత పరిశీలించుదాం.

మొదటిగా ఈ లేఖనంలో రక్షకుడు బయలుపరచబడుచున్నాడు. "క్రీస్తు యేసు వచ్చెను" అను మాటలు ఆయన జననమును నేరుగా సూచించుచున్నవి. యెషయా 7:14లో ఆయన కన్యకు జన్మించునని ప్రవచింపబడెను. మత్తయి 1:23ను కూడా చూడుము. వాక్యము శరీరధారియై మనమధ్య నివసించెనని యోహాను 1:14 చెప్పుచున్నది. ఆయన సశరీరుడుగా ప్రత్యక్షమయ్యెనని I తిమోతి 3:16 చెప్పుచున్నది. దేవుడు మనుష్యుడయ్యాడు! కొలస్స 2:9 ప్రకారము ఆయన దైవ మానవుడు!

యేసు యొక్క జననమును మానవ జాతి ఎంతో గౌరవిస్తోంది. కాలము అంతా ఆయన జననంతో లెక్కింపబడుచున్నది. ప్రతి సంవత్సరము మన ప్రభువు యొక్క (శకములో) సంవత్సరమని చెప్పబడుచున్నది. (A.D అనగా మన ప్రభువు యొక్క సంవత్సరములో యని అర్థము). ఎవరు ఎట్లు, ఎందుకు ఈలాగు కలిపారో ఎవరకీ తెలియదు. రాజులు, చక్రవర్తులు తమ జనన తేదీని బట్టి, లేదా సింహాసనం అధిష్టించినప్పటి నుండి కాలమానాన్ని లెక్కింప ప్రయత్నించారు. ముస్లిములు, మహమ్మదు మక్కా నుండి మదీనాకు క్రీ॥శ॥ 622లో పారిపోయిన నాటి నుండి లెక్కింప ప్రయత్నించారు. ఫ్రెంచి విప్లవము జరిగిన నాటి నుండి కాలము లెక్కించబడాలని ఫ్రాన్స్ దేశము ఆజ్ఞాపించింది. గ్రహచలనములను బట్టి కాలము లెక్కించబడాలని శాస్త్రజ్ఞులు భావించారు. అయినను ఈనాడు లోకంలో యున్నవారంతా మన ప్రభువు జన్మించిన నాటినుండియే కాలాన్ని లెక్కించుదురు. నిర్దేవులు కూడా తమ కేలెండరును క్రీస్తు జననమును బట్టియే సరిజూచుకొనవలసి యున్నది.

రెండవదిగా, మన రక్షకుని యొక్క విమోచనను గూర్చి లేఖనంలో చెప్పబడియున్నది. తన ప్రజలను పాపము నుండి రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెను (మత్తయి 1:21). యేసుక్రీస్తు లోకరక్షకుడని పిలువబడ్డారు (యోహాను 4:42). ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి యే నామమున రక్షింపబడలేము (అ పొ.కా. 4:12).

"పూర్వము దూషకుడను హింసకుడను హానికరుడనైన నన్ను ... బలపరచిన మనప్రభువైన క్రీస్తుయేసుకు కృతజ్ఞుడనైయున్నాను. తెలియక అవిశ్వాసము వలన చేసితిని గనుక కనికరింపబడితిని" అని I తిమోతి 1:13లో పౌలు వ్రాసాడు. తాను క్రైస్తవుడుగా మార్పుజెందక ముందెట్లుండేవాడో పౌలు తన స్వహస్తములతో ఈ మాటలు వ్రాసెను. ఆత్మీయ పాపముల నుండి క్రీస్తు రక్షించునని ఈ లేఖన భాగము వలను మనకు తెలియును. అతడు దేవదూషణ

వలన అపరాధి. దూషణ అంటే వ్యతిరేకముగా మాట్లాడుట. అతడు క్రీస్తుకు వ్యతిరేకముగా మాటలాడెను. యితరులు కూడా అట్లు చేయాలని ప్రోత్సహించెను (అపొ.కా. 26:9). దీనిని బట్టి సాంఘిక పాపముల నుండి క్రీస్తు రక్షించునని మనకు తెలియును. పౌలు క్రీస్తు సంఘమును అపరిమితముగా హింసించి నాశనము చేయజూచెను (గలతీ 1:13). దీనిని బట్టి స్వార్థపర అపరాధముల నుండి దేవుడు రక్షించునని గ్రాహ్యమగుచున్నది. పౌలు హాని చేయబూనుకొనిన వ్యక్తి. అతడు ప్రభువు యొక్క శిష్యులను బెదిరించుటయును హత్య చేయుటయును తన ప్రాణాధారమైనట్లు భావించెను (అపొ.కా. 9:1). అతడింత చేసినను కనికరించబడెను. తన రక్షణ దేవుని కృపయే యని అతడు భావించెను.

మూడవదిగా, మన లేఖన భాగము రక్షకుని పరిచయము చేయుచున్నది. పౌలు దూషకుడు, హింసకుడు, హానికరుడు, పాపులలో ప్రధానుడు. పౌలు ఎన్ని ఘోరకృత్యములు చేసినను క్రీస్తు అతనిని రక్షించుటకు ఇష్టపడెను. అందువలన ఎవనికైనను లేదా అందరికినీ అతడు క్రీస్తును పరిచయము చేయుటకు ఇష్టపడెను! తాను రక్షింపబడ్డాడు గనుక ఎవడైనను రక్షింపబడగలడని అతడు లోకానికి చూపించగోరాడు. రక్షకునికి లోబడితే ఈ లోకానికి యేమి జరుగునో తెలిసికొనడానికి పౌలు ఒకమంచి ఉదాహరణగా యున్నాడు. తనకు విధేయులైన వారందరికీ క్రీస్తు నిత్యరక్షణకు కారకుడాయెనని హెబ్రీ 5:8-10లో వ్రాయబడియున్నది. "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి" యని యేసు బోధించెను (మార్కు 16:15). సృష్టిలో ప్రతివాడు రక్షింపబడగలడు. ఈ మంచివార్తయే సువార్త! పౌలు వంటివాడు రక్షింపబడగలిగితే మానవ జాతి యంతకు నిరీక్షణయున్నది. తన రక్షణను గూర్చి పౌలు ఎంత కృతజ్ఞత కలిగియున్నాడంటే I తిమోతి 1:17లో అతడాయనను స్తుతించు మాటలను వ్రాసాడు. "యేసుక్రీస్తు దేవుడైయుండి

నాకొరకు చనిపోతే, నేనాయనకు ఎంతగొప్ప త్యాగం చేసినా సరిపోదు" అని స్టడ్ అను భక్తుడు వ్రాసాడు.

మన లేఖన భాగంలో రక్షకుడు బయలుపరచబడ్డాడు. ఆయన ద్వారా విమోచన అనుగ్రహింపబడినది. మరియు రక్షకుడు పరిచయం చేయబడ్డాడు. మిత్రులారా, లోకములో యున్న ప్రతివానికి సరిపడిన ఆహారము, వసతి, ఆదాయము వున్నా, మనుష్యులందరు సమానులై ప్రతి దుష్కార్యము అన్యాయము తుడిచి వేయబడినా మానవులకు ఇంకా ఒకటి కొదువయుంటాది. అది క్రీస్తు ఆయన యిచ్చు నిత్య ఆత్మీయ రక్షణ !

-జాన్ స్టేసీ


గమనిక గమనిక

జాన్ స్టేసి గారు వ్రాసిన 28 మంచి ప్రసంగములు

"పరిశుద్ధులకు పాపులకు ప్రసంగాలు" అనే మంచి పుస్తక రూపములో వెలువడినవి. వలయువారు పదిరూపాయల పోస్టేజి స్టాంపులను గాని, మనియార్డరును గాని దిగువ చిరునామాకు పంపి పొందండి:

SATYA VANI, P.O. BOX.NO. 80, KAKINADA - 533 001.

# నీవు జీవమును ప్రేమించుచున్నావా ?
# (Do You Love Life ?)

" జీవమును ప్రేమించి మంచి దినములు చూడగోరువాడు చెడ్డదానిని పలుకకుండ తన నాలుకను, కపటపు మాటలు చెప్పకుండ తన పెదవులను కాచుకొన వలెను. అతడు కీడు నుండి తొలగి మేలు చేయవలెను" అని అపొ. పేతురు క్రొత్త నిబంధనలో వ్రాసెను (1 పేతురు 3:10). దేవుడు "అందరికిని జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు" (అపొ. కా.17:25). జీవమును సృష్టించి, దానిని కొనసాగించువాడు ఆయనే. అందువలన దేవునికి వేరుగా యుండి జీవము యొక్క యధార్థ భావమును మనము కనుగొనలేము. ఒకడు జీవమును ప్రేమించి, సమృద్ధియైన జీవితమును జీవించగోరుచున్న యెడల దేవుడు కోరు రీతిగా అతడు జీవించవలెను. అది ఒక్కటి మాత్రమే జీవించదగునట్టి జీవితము.

మనము జీవించవలసి నట్టి జీవితము భౌతికము కాదు గాని అది ఆత్మీయమై యున్నది. మానవుని భౌతిక జీవితము అంత మొందినను అతని ఆత్మీయ జీవితము కొనసాగుచునే యుండును. దేవుని యందే మనము బ్రతుకుచున్నాము, చలించుచున్నాము. ఉనికి కలిగి యున్నాము (అపొ. కా.17:20). దేవుని నెరుగని జీవితము అర్థ రహితమైనది, జంతు సంబంధమైనది. దేవుడు భౌతిక వ్యక్తి ఎట్లు కాడో, అట్లే ఆయన మానవుని కొసగు జీవితము భౌతిక జీవితము కంటె ఎంతో లోతైనది, గంభీరమైనది. దేవుడను గ్రహించు జీవము ఆత్మీయమైనది.

దేవుడు అమర్త్యుడు. సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వము గలవాడై యున్నాడు. (I తిమో 6:16). దేవుడు అమర్త్యుడనగా మృతి నొందని వాడు. నిత్యము జీవించువాడు. అట్టి దేవునితో

మానవులు సహవాసము కలిగి యుండవలెనని ఆయన కోరుచున్నాడు. దేవునితో సహవాసము కలిగి యుండుటయే జీవము. అయితే దేవుని నుండి వేరై పోవుట మరణము. పాపము దేవుని నుండి మానవుని వేరు చేయుచున్నది. "మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగ వచ్చెను, మీ పాపములు ఆయన ముఖమును మీకు మరగుపరచెను" అని యెషయా ప్రవక్త పలికెను (యెష 59:1,2). దేవుని నాజ్ఞనతిక్రమించు దినమున మానవులు నిశ్చయముగా చచ్చెదరని దేవుడు ఆదిలోనే మానవులను హెచ్చరించెను (ఆది 2:17). మనుష్యులు అందరు పాపము చేయుట వలన మరణము అందరికిని సంప్రాప్తమాయెను (రోమా 5:12). పాపము పరిపక్వమై మరణమును కనును (యాకోబు 1:15). దేవుడు అమర్త్యుడు కాని మానవులు మర్త్యులే.

"పాపము వలన వచ్చు జీవితము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసు నందు నిత్య జీవము" (రోమా 6:23). పాపము చేయు ప్రతివాడును నిశ్చయముగా మరణము నొందును (యెహెజ్కేలు 18:20). పాపము చేయువారు భౌతికముగా జీవించు చుండినను, వారు చచ్చిన వారైనట్లుందురు (1తిమో 5:6). పాపము చేయువారు తమ అపరాధములచేతను, పాపములచేతను చచ్చినవారై యుందురు (ఎఫెసీ 2:1). ఈ భౌతిక జీవితము అంతమొందినను వారు దేవుని వలన కలుగు జీవములో నుండి వేరుపరచబడినవారై కొనసాగుచుందురు. ఇంకొక మాటలలో వారు దేవుని నుండి నిత్యము వేరైపోయిన స్థితిలో యుందురు. అదియే ఆత్మీయ మరణము.

పాపమువలన ఆత్మీయ మరణము సంభవించుచున్నది. అది మానవుని జీవముగల దేవుని నుండి వేరుచేయుచున్నది. అందువలన పాపము తీసివేయబడగల్గిన యెడల మానవునికి దేవునితో తిరిగి సంబంధ మేర్పడగలదు. "నేను మీ మధ్య నడిచెదను, మీకు దేవుడనై యుందును, మీరు నాకు ప్రజలై యుందురు" అని దేవుడు పలికినందువలన (లేవి 26:12), ఇంకొక మాటలో ఆయన నరుని సహవాసము కోరినందువలన, మానవుల పాప పరిహారార్థము

తన ఏకైక కుమారుని బలియిచ్చెను. మానవుడు దేవుని (ఆత్మీయ) స్వరూపమందు చేయబడినందున దేవుడు అతని సహవాసమును కోరెను. యేసు అతి భయంకరమైన బాధను, ఘోరమైన సిగ్గును సిలువపై భరించెను. ఆయన లోకమందలి పాపములను మోసెను గనుక దేవుని నుండి కూడ సిలువపై వేరుచేయబడెను (మత్తయి 27:46). యేసు క్రీస్తు యొక్క మరణమే విశ్వాసి యొక్క జీవము.

"ఆయనలో జీవముండెను, జీవము మనుష్యులకు వెలుగై యుండెను" (యోహాను 1:4). తండ్రియైన దేవుని నుండి కలుగు నిత్యజీవమును మనుష్యులకు ప్రత్యక్షపరచు నిమిత్తము ఆయన ప్రత్యక్షపరచబడిన జీవవాక్యము. "యేసు పునరుత్థానమును జీవమును నేనే: నా యందు విశ్వాసముంచు వాడు చనిపోయినను బ్రదుకును: బ్రతికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు" అని పలికెను (యోహాను 11:25,26). ఆయనే మార్గము, సత్యము, జీవమునై యున్నాడు (యోహాను 14:6). "దేవుని కుమారుని అంగీకరించువాడు జీవము గలవాడు, దేవుని కుమారుని అంగీకరింపనివాడు జీవము లేనివాడే" (1 యోహాను 5:12). యేసు నందు విశ్వాస ముంచువాడు నిత్య జీవముగలవాడు (యోహాను 5:24).

నిత్య జీవితమునకు దేవుడు ఆధారభూతుడైన యెడల, నిత్యానందమునకు కూడ ఆయనే ఆధారభూతుడు, పాపభోగములు అల్పకాలము మట్టుకే యుండునవి. ఈ లోకము అనుగ్రహించు సుఖ భోగములన్నియు మానవుని ఆత్మీయ తృష్ణను తీర్చలేవు. దేవుడు మనలను ఆయన కొరకు సృజించెను. మన మాయన యందు విశ్రాంతి పొందువరకు మనము విశ్రాంతి పొందక యుందుము. యథార్థము సంతోషము లోపల నుండి కలుగునట్టిది. బయట వాతావరణ మెట్లున్నను అది చలింపనట్టిది. అందుకే అపొస్తలులు చెరసాలలో యుండినను ప్రభువు నందు బహుగా ఆనందించెను (ఫిలి 4:4).

పాపికి పాప క్షమాపణ క్రీస్తులో మాత్రమే దొరకును. క్షమాపణ లభించని యెడల కయీనువలె 'నా దోషశిక్ష నేనుభరింపరానంత గొప్పది' యని మనము

నిరాశ చెందవచ్చును (ఆది 4:13). అయితే దేవుడు మనలను అత్యధికముగ క్షమించుటకు సిద్ధముగా యున్నాడు. "భక్తిహీనులు తమ మార్గమును విడువవలెను. దుష్టులు తమ తలంపులను మానవలెను. వారు యెహోవా వైపు తిరిగిన యెడల ఆయన వారి యందు జాలిపడును. వారు మన దేవుని వైపు తిరిగిన యెడల ఆయన బహుగా క్షమించును" అని యెషయా వ్రాసెను (యెషయా 55:7). పాపులు దేవుని వైపు తిరిగిన యెడల "వారి పాపములను, వారి అతిక్రమములను ఇకను ఎన్నటికిని జ్ఞాపకము చేసి కొనను అని ప్రభువు చెప్పుచున్నాడు" (హెబ్రీ 10:17).

అందువలననే క్రైస్తవునికి మరణ భయము లేదు. నిరీక్షణలేని యితరులవలె అతడు దుఃఖపడడు. యేసు మరణ భయము నుండి మనలను విడిపించెను (హెబ్రీ 2:14,15). అందువలననే అపొ. పౌలు. 'నామట్టుకైతే బ్రతుకుట క్రీస్తే చావైతే లాభము' అని పలికెను (ఫిలిప్పి 1:21).

దేవుడు ప్రతి మనుష్యుని యెదుట జీవమును, మరణమును, ఆశీర్వాదమును, శాపమును ఉంచియున్నాడు (ద్వితీ 30:19). మనము జీవించు జీవితములో రెండే రెండు మార్గములున్నవి. ఒకటి నిత్య జీవమునకును, మరొకటి నిత్య నాశనమునకును నడుపును (మత్తయి 7:13,14). ఈ రెండింటిలో ఏదో ఒక దానిని మనమెన్నుకొనవలసి యున్నది. నిత్యజీవమును నీవు పొందుగోరుచున్న యెడల ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము: "కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్య జీవమును గలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వాని మీద నిలిచి యుండును" (యోహాను 3:36). నీ పాపముల విషయమై మారు మనస్సు నొందుము. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము (అపొ. కా. 2:38). క్రీస్తు నందలి విశ్వాసమును బట్టి క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినవాడు దేవుని కుమారుడనబడును: "యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు.

క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:26,27). క్రీస్తు నందున్నవాడు నూతన సృష్టి (2 కొరింథి 5:17). అతని పేరు జీవగ్రంథములో వ్రాయబడును. అతడు నిజమైన జీవితమును ఇప్పుడును, నిత్య జీవితమును తదనంతరమును కలిగి యుండును. నీవు జీవమును ప్రేమించుచున్నావా? అయితే చెడుతనమును విసర్జించి క్రీస్తుకు ఈనాడే లోబడుము !!!

-- జాషువా గూటం

❖❖❖❖

# స్వయం పోషక సంఘాన్ని నిర్మించుట
# (Building a self Supporting Church)

సువార్త బోధించుటకు సిద్ధముగా యున్న యువకులలో చాల మంది తమ సమయాన్ని పూర్తిగా సువార్తకే వినియోగించాలని కోరుకొందురు. ఏదో ఒక ఉద్యోగం చేసుకొంటూ సువార్త చేయుటకు వారికి ఆసక్తి యున్నట్లుఅగుపడదు. అట్లెందుకు చేయకూడదని నేను సలహా ఇయ్యగా, నేను ఫుల్‌టైమ్ సువార్తికునిగా యుండాలను కొనుచున్నానని చాలమంది చెప్పారు. దాని అర్థం యేమిటి? వారికి ఫుల్‌టైమ్ జీతం కావాలి, అంతే! అంటే వారి జీతం కొరకు ఏదో ఒక విదేశీ స్థావరం దగ్గరకు వెళ్ళాలి. అట్టిది దొరికినప్పుడు చాలమంది యేం చేస్తారు? జీతం సంపాదించుకొంటారు అంతే. వారుగాని, స్థానిక సంఘముగాని దానివలన యేమి లాభం పొందరు.

నీవు యువక బోధకుడవైతే, ప్రభువు తట్టు నిజంగా మార్పు జెందిన వాడవైతే, ఆయన వాక్యము బోధించుటకు సమర్పించుకొన్న వాడవైతే, ఒక్కొక్క అడుగు ముందుకు వేయుము. మొదటిగా, నీవు తగు శిక్షణ పొందుము. దానికి ముందు విద్యనభ్యసించు వీలైతే కాలేజీ విద్యనభ్యసించు. నీవు విద్యనభ్యసించుచుండగా నీ బైబిలు చదువుము, ధ్యానించుము. నీ

పతనమునకు సహాయపడు మరికొన్ని గ్రంధములను సేకరించుము. నీ స్థానిక సంఘములో జరుగు కార్యక్రమములలో పాలుపొందుము. నీ ఏరియాలో ఏదైనా స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఉంటే ఒకటి, రెండు సంవత్సరముల మట్టుకు నీవక్కడ శిక్షణ పొందితే మంచిది.

మీ ఊరిలో ఉండగా, నీకు దొరికే ప్రతి తరుణంలోను బోధించు. స్థానిక సంఘము నీకు ఆర్థిక సహాయం చేయలేకపోతే ఏదైనా ఉద్యోగం సంపాదించుకో, పెండ్లి చేసుకో, కుటుంబము నేర్పాటుచేయి. నీ జీవనోపాధిని సంపాదించు కొరకూ ప్రభువు పనిని కూడా చేయగలవు. అపొస్తలుడైన పౌలు అట్లే చేసాడు (అపో. కా. 18:3). అతడు తన స్వంత చేతులతో కష్టపడి పని చేసాడు (1 కొరింథీ 4:12). అయితే అతడు బోధించుట మానివేయలేదు. నీవు నిజంగా బోధించాలని కాంక్ష కలిగి యుంటే, నీవు కూడా మానివేయలేవు.

యితరులతో కలిసి పనిచేయుట నేర్చుకో, మిగతా బోధకులను నీ శత్రువులుగను, పోటీదారులుగను ఎంచకు. నిన్ను వారు సరిగ చూడక పోయినను, వారి యెడల నీవు మంచి స్వభావము కలిగి యుండాలి.

బహుశ నీవొక స్థానిక సంఘానికి పని చేయువచ్చు, లేదా ఒక క్రొత్త ఏరియాకు వెళ్లి పనిని ప్రారంభించి, అది నీకు ఆర్థిక సహాయం ఇచ్చేంత వరకు అభివృద్ధి పరచవచ్చును. ఈ పనిలో యుండగా నీవే బిగ్ బాస్ లాగ ప్రవర్తించకు; పాటలు, ప్రార్థన, బోధ, ప్రభు రాత్రి భోజన కార్యక్రమం వగైరా అన్నీ నీవే చేసేయకు గాని సంఘ సభ్యులను కూడా తమ తలాంతులను వినియోగించుటకు ప్రోత్సాహించు. అప్పుడు వారు అన్ని విధాలా అభివృద్ధి చెందుతారు. నీకవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తారు. యిలా జరిగినప్పుడు ఉప్పొంగిపోయి గర్వించకు గాని నిన్ను నీవే తగ్గించుకొని సహోదరుల యెడల ప్రేమను, నశించిన వారికి రక్షణ సువార్తను అందించుటకు ఆసక్తిని ఎల్లవేళలా కలిగి యుండు.

నీవు దేవునికేదైనా గొప్పకార్యము చేయాలను కొంటే, స్వయం పోషక స్థానిక సంఘమును నెలకొల్పు. యిది నీకొక పరీక్ష. మిగతా బోధకులకు సంఘాలకు యిది గొప్పమాదిరి. ఈ దేశానికి అవసరమైనది నిజంగా స్వయం పోషక సంఘాలే, అవి తమ స్వంత పెద్దలను పరిచారకులను కలిగి, తమ నిర్ణయాలు తాము చేసుకొంటూ, తమ అవసరములను తాము తీర్చుకొంటూ, విదేశీ సహాయం లేకుండా తమ పనిని కొనసాగించుకొనగలవు. అట్లయినప్పుడు యితరులు కూడ చాల ప్రోత్సహించబడుదురు.

సహోదరులలో అనేకులు పై నుండి వచ్చే సహాయనికే ఎదురు చూచుచు, తమ అభివృద్ధిని గూర్చి నిర్లక్ష్యము చేయుచున్నారు. ఇప్పటికే వారు యితరుల అవసరములను తీర్చవలసియుండగా, వారే ఇంకా యితరుల సహాయం కొరకు చేతులు చాపుదురు. స్థానిక సంఘములో ఎన్ని కుటుంబములు ఆర్థికంగా స్వయం పోషణలో యున్నారు? వారు ధనవంతులు కాక పోవచ్చును, పెద్ద జీతగాళ్లు కాకపోవచ్చును, గాని తమ అవసరములను తాము తీర్చుకొందురు. అట్లయితే స్థానిక సభ్యులే సంఘపు అవసరములను తీర్చుటకు సరిపడినంత ఎందుకు ఇయ్యలేరు? ఈ పనిని ఒకే ఒక్క కుటుంబము చేయకూడదు, గాని కొన్ని కుటుంబాలు కలిసి ధారళముగా యిచ్చిన బోధకునికి సంఘము ద్వారా సహాయం అందగలదు.

స్వయం పోషక సంఘాలు బయలుదేరు చున్నప్పుడు, మిగతా వారుకూడా వారి మాదిరి ననుసరింపగోర్తారు. అంతేగాక, స్థానిక సంఘాలు స్వయం పోషకమవుచుండగా, అనేక సంగతులు ఆరంభించుటకు మొదలిడుతాయి. వారు స్వయంగా మిషనెరీలనే పంపించుటకు పూనుకొనవచ్చును. ఇప్పుడు బోధకుల ట్రయినింగ్ స్కూళ్లకు సహాయం చేయగలరు. తరువాత వారితో కొంతమంది క్రైస్తవులు కలిసి ఒక క్రైస్తవ కళాశాలను స్థాపించవచ్చును. అనాధ శరణాలయాలకు సహాయమియ్యవచ్చును. అట్టి పనులు అనేకము

చేయవచ్చును.

మరల, బోధకునిగా నీ వేమిచేయగలవు? సంఘము సంఖ్యలో అభివృద్ధిజెందాలనే సంగతి బోధించుము. మరియు క్రైస్తవులు యిచ్చుటలోను, దృక్పథములోను ఆత్మీయంగా పెరిగేలాగున చూడుము. వాళ్లకున్నదంతా ఖాళీ చేసేయుటకు ప్రయత్నించకు, గమ్యం యేమి లేకుండా సాకులు చెప్పుచు సోమరిగా యుండకు, స్థానిక సంఘం క్రీస్తులో స్వయం పాలన కలిగిన సంఘముగా నుండుటకు, స్వయం పోషక సంఘముగా తయారవుటకు లేచి పనిచెయ్యి. అట్టి దినం కొరకు కష్టపడి పనిచేయి. అది జరిగినప్పుడు సంతోషించు. దేవుని సహాయంతో అది సంభవింపవచ్చు.

-- జె.సి. ఛోట్.

❖❖❖❖

# సువార్తికుడు
## (The Evangelist)

సువార్త ప్రకటన అనేది దేవదూతలకు సహితము అనుగ్రహింప బడని భాగ్యము. క్రీస్తు మరణ సమాధి, పునరుత్థానములను లోకానికి ప్రకటించువాడే సువార్తికుడు (1కొరింథీ 15:3). మహిమాన్వితమైన క్రీస్తు సువార్త ప్రకటించు వారి పాదము లెంతో సుందరమైనవని పౌలు ప్రబోధించుట వలన సువార్తికుని పని దేవుని దృష్టిలో మిక్కిలి ఔన్నత్యమైనది (రోమా 10:15).

సువార్తికుడు యోగ్యుడై, సిగ్గుపడనక్కర లేని పనివాడై, సత్యవాక్యమును

సరిగ ఉపదేశించు వాడై యుండాలని పౌలు, తిమోతిని హెచ్చరించెను (II తిమో 2:15). అతడు పట్టుదల, సహనము, ధైర్యము మరియు త్యాగమే ఆయుధములుగా ధరించి అపవాది పై అవిశ్రాంత పోరాటమును సాగించువాడు. సువార్త ప్రకటనలో సమయమునకు అసమయునకు భేదం ఎరుగనివాడు. ఇతడు ప్రతి ఫలాపేక్షలేనివాడై తన లేమియందైనను, ఎట్టి సమయమందైనను తన పనిని కొనసాగించును.

బందీయై, నేరారోపణ చేయబడి విచారణ నిమిత్తమై రాజు ఎదుట నిలువబడి అగ్రిప్ప రాజుతో దేవుని వర్తమానమును మాట్లాడిన పౌలు సువార్తికుడే (అ॥కా 26:24-29).

"దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవునిని ఎరుగకుండి నందున, సువార్త ప్రకటన యను వెఱ్ఱితనము చేత నమ్మువారిని రక్షించుట దేవుని దయా పూర్వక సంకల్పమాయెను" (1 కొరింథీ 1:21). సువార్త ప్రకటించుట లోకానికి వెఱ్ఱితనముగా కనపడినను అందు "రక్షణ" యను దేవుని సంకల్పము అంతర్లీనమై యున్నది.

ఒక సుందరమైన భవనము దాని నిర్మించిన పనివారి ప్రతిభ, సామర్థ్యములను తెలియజేయును. ఒక నదిపై నిర్మించిన వారధి (వంతెన) పై ప్రయాణించినప్పుడు మనకు కలిగిన సౌక్యరమును బట్టి నిర్మించిన వారి పనితనమును శ్లాఘించుదుము. ఒక సువార్తికుడు చేయుచున్న పని ఎంత విలువైనదైనప్పటికిని ప్రజలు దానిని బహుశ గమనించరు.

చిన్నపిల్లలకు యితడు చేసిన ఉపదేశము వారిని దీర్ఘాయుష్మంతులనుగ, మేలు కరముగ చేయును. "నీ తల్లిని నీ తండ్రిని సన్మానించుము" (ఎఫె 6:2). కుటుంబంలో, సమాజంలో, దేశంలో మరియు ప్రపంచంలో శాంతి సమాధానాలను నింపే ప్రబోధాలు చేసే సువార్తికుడు ఒక

విశిష్ఠ వ్యక్తి. యితడు సహోదరుల కొరకు ప్రపంచ శాంతి కొరకు చివరికి శత్రువుల కొరకు సహితం నిత్యం ప్రార్థించును.

లోపాలు కలిగిన సువార్తికులు లోకంలో కొందరు ఉండవచ్చును. గోధుమలతో పాటు గురగులు ఉంటాయి. కాని వాటి గమ్యాలు వేరుగా ఉంటాయి. గోధుమలు సురక్షిత స్థలానికి, గురుగులు నిత్యాగ్నికి చేరతాయి. గురుగులు, గోధుమలతో పెరుగట వ్యవసాయదారునికి అయిష్టమయినప్పటికిని వాటిని కోత సమయం వరకు భరిస్తాడు.

"క్రీస్తు సువార్త ప్రకటించుటకు నేను త్రోయ వచ్చినప్పుడు, ప్రభువునందు నాకు మంచి సమయము ప్రాప్తించి యుండగా సహోదరుడైన తీతు నాకు కనపడనందున, నా మనస్సులో నెమ్మదిలేక వారి యొద్ద సెలవు తీసుకొని అక్కడనుండి మాసిదోనియుకు బయలు దేరితిని. మా ద్వారా ప్రతి స్థలమందును క్రీస్తు గూర్చిన జ్ఞానము యొక్క సువాసనను కనుపరచుచు అయన యందు ఎల్లప్పుడు విజయోత్సవముతో ఊరేగించుచున్న దేవునికి స్తోత్రము. రక్షింపబడు వారి పట్లను నశించువారి పట్లను మేము దేవునికి క్రీస్తు సువాసనయై యున్నాము" (II కొరింథి 2:12).

శ్రమ, బాధ, హింస, కరవు, వస్త్రహీనత, ఉపద్రవము మరియు ఖడ్గమైనను అయన ప్రేమ నుండి మనలను దూరము చేయలేవు.

-- E.K.V. ప్రసాదరావు,
చేయ్యేరు.

❖❖❖❖

# క్రీస్తును గూర్చి మీకేమి తోచుచున్నది?
# (What Think Ye of Christ?)

యేసుక్రీస్తు ఈ లోకమందు ఉద్భవించినది మొదలుకొని ఆయన యెవరు? అనే ప్రశ్నను ప్రతివారు ఎదుర్కొనవలసి వచ్చుచున్నది. ఈ లోకమందు సంచరించిన అనేక మతగురువుల వలె గాక యేసు యొక్క నామము ప్రతివాని లోను వివిధ భావములను రేకెత్తించుచున్నది. ఇది చాల ప్రాముఖ్యమైన ప్రశ్న. విశ్వాసమునకది మూలరాయి వంటిది (యెష 28:16). మానవుడు క్రీస్తుని గూర్చి ఏమి తలంచుచున్నాడో దానిని బట్టి అతని ఆత్మయొక్క గమ్యస్థితి యుండును. అందుకే "నేను ఆయనననని (అనగా దేవుని కుమారుడనని) మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని" యేసు చెప్పెను (యోహాను 8:24).

"ఒకప్పుడు పరిసయ్యులు కూడియుండగా యేసు వారిని చూచి క్రీస్తుని గూర్చి మీకేమి తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడని అడిగెను. వారు ఆయన దావీదు కుమారుడని చెప్పిరి" (మత్తయి 22:41,42). శరీరమును బట్టి యేసు క్రీస్తు దావీదు కుమారుడయ్యెను (రోమా 1:7). ఆయన తల్లియైన మరియ మనుష్య మాత్రురాలు గనుక ఆయన మనుష్యకుమారుడాయెను. క్రీస్తు శరీరధారియై మనమధ్య నివసించెను (యోహాను 1:14). ఆయన దైవ మానవత్వములను కలిగి యుండటవలన మానవుల రక్షకునిగాను, దేవుని సన్నిధానమున వారికి మధ్యవర్తిగాను ఉండుటకవకాశ మేర్పడెను (1తిమో 2:5,6). మనుష్య కుమారునివలె క్రీస్తు శోధింపబడెను. ఆకలి దప్పికల ననుభవించెను. శ్రమలను, బాధలను భరించెను. మానవులందరివలె ప్రార్థనావశ్యకతను కలిగియుండెను. అయితే ఆయన కేవలము

మానవమాత్రుడు కాడు.

యేసుక్రీస్తు దేవుని అద్వితీయకుమారుడై యుండెను. యేసు దావీదు కుమారుడని పరిసయ్యులు చెప్పినది సత్యమే గాని, అది పరిపూర్ణ సత్యము కాదు. క్రీస్తు కేవలము మానవుడే అయితే దావీదు ఆయనను ప్రభువని ఏల సంభోధించెనని యేసు వారినడిగెను. క్రీస్తు దావీదుకు ముందునుండియే యుండెను. నిజానికి ఆయన లేని సమయమంటు ఎన్నడు లేనేలేదు (యోహాను 1:1; 8:58). ఆయన అల్ఫాయు ఓమెగయు ఆదియు అంతమునైయున్నాడు (ప్రకటన 1:8). కాలారంభము కాకముందు నుండియే క్రీస్తు ఉండెను. కాలాంతమయి పోయినను కూడ ఆయన ఉండును.

క్రీస్తు దేవుని యొక్క ఏకైక కుమారుడు. పరిశుద్ధాత్మని శక్తివలన ఆయన ఒక కన్యకు జన్మించెను. ఆయన తండ్రి దేవుడు గనుక ఆయన దైవత్వము కలిగి దేవుని కుమారుడైయుండెను. ఆయన ఇమ్మానుయేలని పిలువబడెను. ఇమ్మానుయేలనగా దేవుడు మనకు తోడని యర్థము (మత్తయి 1:23). ఆయన శరీరధారియైన దేవుడు : "నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చిన మర్మము గొప్పదైయున్నది; ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మవిషయమున నీతిపరుడని తీర్పునొందెను, దేవదూతలకు కనబడెను, రక్షకుడని జనములలో ప్రకటింపబడెను, లోకమందు నమ్మబడెను. ఆరోహణుడై తేజోమయుడయ్యెను" (1 తిమో 3:16). అందువలననే యేసు "నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడని" చెప్పగలిగెను (యోహాను 14:9). ఆయన దేవుని మహిమయొక్క తేజస్సును, ఆయన తత్వముయొక్క మూర్తిమంతమునై యుండెను (హెబ్రీ 1:3).

యేసు దేవుని కుమారుడని సాక్ష్యము పొందెను. యేసు యోర్దాను నదిలో యోహాను చేత బాప్తిస్మము పొందగా ఇదిగో ఈయన నా

ప్రియకుమారుడని తండ్రియైన దేవుడు ఆకాశమునుండి సాక్ష్యమిచ్చెను (మత్తయి 3:16,17). మరల యేసు ఒక కొండమీద రూపాంతరము పొందగా అదే సాక్ష్యపు పలుకులను దేవుడు ఆయనను గూర్చి మరల పలికెను (మత్తయి 17:1-5). యేసుయొక్క శిష్యులు కూడ ఆయన నిజముగా దేవుని కుమారుడని చెప్పి ఆయనకు మ్రొక్కిరి (మత్తయి 14:34). దయ్యములు పట్టిన మనుష్యులు కూడ యేసు దేవుని కుమారుడని చివరకు అపవాదికూడ ఒప్పుకొనెను (మత్తయి 4:3). అంతేకాదు యేసును సిలువవేసిన సైనికులు సహా "నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి" (మత్తయి 27:54).

క్రీస్తు దేవుని కుమారుడనని తననుగూర్చి తాను చెప్పుకొనెను (మత్తయి 27:43). నేటి వేదాంతులు ఆయన ఒక సత్పురుషుడేగాని దేవుని అద్వితీయకుమారుడు కాడని చెప్పుదురు. సత్పురుషులు అబద్ధమాడజాలరు. ఆయన దేవుని కుమారుడు కానియెడల సత్పురుషుడెట్లు కాగలడు? ఆయనను గూర్చి నీకేమి తోచుచున్నది ? ఆయన దేవుని కుమారుడని దైవవేదము ఘోషించుచున్నది. అయితే నీ యభిప్రాయమేమిటి ? ఆయన యెవరి కుమారుడు?

యేసు చేసిన బోధలు ఆయన దేవుని కుమారుడని సాక్ష్యమిచ్చుచున్నవి. ఆయన ప్రజలకు బోధించినప్పుడు వారి శాస్త్రులవలె గాక అధికారముగల వానివలె వారికి బోధించెను (మత్తయి 7:29). ఆయనలో సహజముగాయున్న అధికారమును బట్టి మానవులకంటె ఉన్నతునిగా ఆయన అగుపడెను. ఆయన భవిష్యత్తును సంపూర్ణముగ ఎరిగినవానివలె ఖచ్చితముగా బోధించెను. మనుష్యుల అంతరంగిక స్వభ్వాము ను ఆయన ఎరిగియుండెను. అందువలన ఆయన మానవులకంటె మిన్నయైన వాడని నిరూపించుకొనెను. యేసు అందరిని ఎరిగినవాడు. ఆయన మనుష్యుని అంతర్యమును ఎరిగినవాడు. గనుక ఎవడును మనుష్యునిగూర్చి ఆయనకు సాక్ష్యమియ్య నక్కరలేదు అని యోహాను 2:24,25 లో వ్రాయబడియున్నది.

యేసు చేసిన బోధ అంతయు సంపూర్ణమైనది, శ్రేష్ఠమైనది. ఆయన బోధలను వేదాంతులు, విగ్రహారాధికులు, దేశనాయకులు, యూదులు, క్రైస్తవులు మొదలగువారనేక రీతులగ పరిశోధించుచునే యున్నారు. అయితే నేటివరకు ఏమానవుడు కూడ ఆయన బోధలో దోషమున్నట్లు చెప్పలేకపోవుచున్నాడు. అందుకే యూదుల ప్రధానయాజకులు పరిసయ్యులు యేసును పట్టుకొనుడని కొందరు బంట్రోతులను పంపితే వారాయనను పట్టుకొనలేదు సరిగదా ఆ మనుష్యుడు మాటలాడినట్లు ఎవడును ఎన్నడును మాటలాడలేదని సాక్ష్యమిచ్చిరి (యోహాను 7:46).

యేసు చేసిన క్రియలు ఆయన దేవుని కుమారుడని నిరూపించుచున్నవి. "నేను నా తండ్రి క్రియలు చేయని యెడల నన్ను నమ్మకుడి, చేసినయెడల నన్ను నమ్మకున్నను తండ్రి నాయందును నేను తండ్రియందును ఉన్నామని మీరు గ్రహించి తెలిసికొనునట్లు ఆ క్రియలను నమ్ముడని " క్రీస్తు బోధించెను (యోహాను 10:38). ప్రకృతిశక్తుల మీద ఆయన అధికారము కలిగియుండెను. ఆయన తుఫానును గద్దింపగా గాలి, సముద్రము నిమ్మళమాయెను (మత్తయి 8:23-27). ఆయన నీటిపై నడచెను, నీళ్లను ద్రాక్షారసముగా మార్చెను.

మనుష్యులను పీడించు వ్యాధులపై ఆయన అధికారము కలిగియుండెను. కుష్ఠరోగి ఒకడు వచ్చి ఆయనకుమ్రొక్కి, ప్రభువా, నీకిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవనెను. అందుకాయన చెయ్యిచాపి వానిని ముట్టి నాకిష్టమే, నీవు శుద్ధుడవుకమ్మని చెప్పగా తక్షణమే వాని కుష్ఠరోగము శుద్ధియాయెను (యోహాను 8:2-4). పండ్రెండు సంవత్సరముల నుండి రక్తస్రావముచే బాధపడుచున్న స్త్రీ యొకతె ఆయన వస్త్రపు చెంగు ముట్టెను. యేసు వెనుకకు తిరిగి ఆమెను చూచి కుమారీ, ధైర్యముగా ఉండుము, నీ విశ్వాసము నిన్ను బాగుపరచెనని చెప్పగా, ఆ గడియనుండి ఆ స్త్రీ బాగుపడెను (మత్తయి 9:20-22).

రోగమే కాదు, మరణము కూడ క్రీస్తుకు లోబడెను. ఆయన చనిపోయిన లాజరును మరల బ్రదికించెను. యేసు అనేక అద్భుతములను చేసెను. వాటిలో కొన్ని మాత్రమే క్రొత్త నిబంధనలో వ్రాయబడెను. మనము యేసునందు విశ్వాసముంచ గల్గునట్లు అవి వ్రాయబడెను (యోహాను 20:30,31). యేసును గూర్చి బైబిలునందు వ్రాయబడిన సంగతులను మనము నిరభ్యంతరముగా నమ్మవచ్చును. బైబిలును వ్రాసిన లేఖకులు దేవుని ఆత్మచే నడిపింపబడిరి. సరిగదా వారు ఏది వింటిరో, కన్నులారా ఏది చూచితిరో, నిదానించి ఏది కనుగొంటిరో, వారి చేతులు దేనిని తాకి చూచెనో దానిని గూర్చి వారు వ్రాసిరి. అంతేకాదు ఆ లేఖకులు తాము విశ్వసించిన దాని కొరకు తమ ప్రాణములను కూడ అర్పించిరి. గనుక వారిచ్చిన సాక్ష్యము యధార్థమని మన మంగీకరించవచ్చును.

క్రీస్తు ఈ లోకమునందుద్భవించనది మొదలుకొని చరిత్ర యొక్కగతియే మార్చబడినది. కాలము ఆయన రాకడను బట్టి లెక్కింపబడుచున్నది. నాటినుండి నేటి వరకు ఆయన నామము లోకమందంతట ప్రకటింప బడుచుండగా కోట్లకొలది ప్రజలు ఆయన దేవుని కుమారుడని విశ్వసించి ఆయనకు విధేయులగుచున్నారు. మిత్రుడా, క్రీస్తుని గూర్చి నీకేమి తోచుచున్నది? ఆయన దేవుని కుమారుడని నిరూపించు అనేక ఋజువులను ఈనాడు నీకు చూపింతిని. నీవు నీ పాపముల నుండి విముక్తుడవు కావలెనంటే యేసునందు విశ్వాసముంచుము. నీ పాపముల విషయమై మారుమనస్సు నొందుము. క్రీస్తునామమును బహిరంగముగా ఒప్పుకొనుచు, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. క్రీస్తే దేవుని కుమారుడని లోకానికి ప్రకటించుచూ ఆనంద జీవితము జీవించుము !

--జాషువా గూటం

❖❖❖❖

హర్షల్ గారు ప్రభువు సేవ నిమిత్తమై ప్రతిష్టించిరి. అక్కడ కూడా వాక్యమును ప్రకటించిరి. బడుగువారి పేటలో పండ అర్జున్‌రావ్ గారును, ఆదిలక్ష్మి పేటలో పెయ్యేల సత్యనారాయణ గారును సువార్త చాటుచున్నారు.

జూలై నెలలో జాన్ రిక్కీ గూటం గారు కందరాడ, గుత్తినదీవి, పిఠాపురం, ఇందిరాకోలనీ, విశాఖపట్టణం మొదలగు ప్రదేశములలో ఏర్పాటు చేయబడిన కూటములలో వాక్యోపదేశము చేసిరి. ఆయన ఆగష్టు మూడవ వారము వరకు ఇండియాలో యుందురు.

జూలై 25వ తేదీ గురువారం నిడదవోలు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.ఎ.ఎస్.ప్రభాకర్ గారి కుమార్తె ప్రశాంతి యొక్క వివాహము ఘనముగా జరిగెను. ఆ సందర్భముగా జాషువా గూటం గారు వివాహ సందేశమునిచ్చిరి. ప్రశాంతి జాషువా, నెహెమ్యా గార్ల సోదరి హెప్సీగారి కుమార్తె. హెప్సీగారు నిడదవోలు డిగ్రీ కాలేజీలో హిస్టరీ హెడ్‌గా యున్నారు. ప్రశాంతి యొక్క వరుడు సాగర్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేయుచున్నారు.

జూలై 27వ తేదీ శుక్రవారం పిఠాపురం మండలం ఫక్రుద్దీన్ పాలెంలో సువార్తికుల సదస్సు ఘనముగా జరిగెను. తూర్పు, పశ్చిమ, విశాఖ జిల్లాల నుండి సువార్తికులు సకాలములో చేరుకొనగా స్థానిక క్రీస్తు సంఘ ఆలయము సువార్తికులతో నిండిపోయెను. ఆరాధనలో ప్రభు రాత్రి భోజనము యొక్క పాత్ర యేమిటి? అను అంశము ఆ రోజు చర్చించబడెను. సోదరులు టి.వి.యన్. కుమార్ గారు స్థానిక సంఘ చరిత్రను చెప్పి స్థానిక సువార్తికులు యమ్. సూర్యారావ్ గారిని పరిచయం చేసిరి. తదుపరి జాషువా గూటం గారు భారతదేశంలో క్రీస్తు సంఘ చరిత్రను క్లుప్తముగా వివరించి 20వ శతాబ్దములో జె.సి.బెయిలీగారి శ్లాఘనీయమైన కృషిని, త్యాగమును వివరించిరి. తదుపరి సభ అంతయు నిలబడి బెయిలీ గారి గొప్పపనికి జ్ఞాపకార్థముగాను, ఆయన విడిచి వెళ్లిన సంతతికి సానుభూతి తెలుపుటకును రెండు నిమిషములు మౌనము పాటించిరి. సోదరులు టి.వి.యన్. కుమార్ గారు బెయిలీ గారి పనిని జ్ఞాపకం చేసుకొంటూ,ఆయన కొరకు స్తుతి చెల్లిస్తు ప్రార్థించిరి.

తదుపరి సదస్సు వి. స్వామినాదం (పెద్దాపురం) గారి ప్రార్ధనతో ఆరంభమాయెను. చర్చలో జి. షద్రక్ (పాలకొల్లు), సామ్యూల్ రోనీ గూటం (కాకినాడ), టి.వి.యన్. కుమార్ (కాకినాడ), బుర్రే యోహాను (కురెళ్లగూడెం), జాషువా గూటం గారు పాల్గొనిరి. సోదరులు యేసురత్నం (పిఠాపురం) గారి ప్రార్ధనతో సదస్సు ముగిసెను. వచ్చిన వారందరికీ స్థానిక సంఘము మంచి విందునేర్పాటు చేసిరి. స్థానిక సంఘ ఆలయము యొక్క పైకప్పు మార్చినందున అది చక్కగా కనబడెను. ఫక్రుద్దీన్ పాలెంలో సోదరులు యమ్. సూర్యారావ్ గారు పలు సంవత్సరముల నుండి టి.వి.యన్. కుమార్ గారి సహాయసహకారములతో క్రీస్తుకొరకు ఆసక్తి కలిగి గొప్పపని చేయుచున్నారు.

ఆగష్టు నెల సువార్తికుల సదస్సు పిఠాపురం మండలం ఇసుకపల్లిలో 29వ తేదీ నాడు జరుగును.

బెయిలీ గారి మృతికి సంతాపము తెలియజేస్తూ వందలాది ఉత్తరములు, టెలిఫోన్లు చేసిన వారందరికీ మా ధన్యవాదములు

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/05/2001

From:

**SATYA VANI**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

To

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. KAKINADA - 533 004. Editor : Joshua Gootam